సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం, 14, సెప్టెంబర్, 2025



**రాజభాష హిందీ** - 8లో

హిందీ భాష దేశ భాషే కాకుండా రాజసం ఉట్టిపడే రాజభాష. దేశ ప్రజలందరినీ ఒకే తాటి మీదకు తీసుకొచ్చేందుకు ప్రధాన వారధి హిందీ భాష.



**17న ఆటోల బంద్** - 8లో

ఈ నెల 17న నిర్వహించనున్న ఆటోల జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి నారాయణరావు పిలుపునిచ్చారు.

**ఐదుగురికి నక్క కాటు**



అక్కరాపల్లి గ్రామానికి చెందిన ఎమ్.లక్ష్మి, కె.సూరయ్య, వి.ల చ్చమ్మ, బూరాడపేట గ్రామానికి చెందిన బంటుపల్లి చిన్నోడు, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం నిమ్మ తొర్లాడ గ్రామానికి చెందిన కె.జగన్‌మోహన్ లకు నక్క కాటేసింది. - 8లో

## న్యూస్‌రీల్

### సమన్వయంతో పనిచేద్దాం.. ప్రగతి సాధిద్దాం

**పార్వతీపురం రూరల్:** జిల్లా అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి దోహదపడాలని కలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులను ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే జిల్లా అధికారులతో కలెక్టరేట్ సమావేశమందిరంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అధికారుల అనుభవాలు జిల్లా అభివృద్ధికి తోడ్పడేలా ఉండాలని, సూపర్‌విజన్‌తో జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన లబ్ధిదారులకు అందించేలా అన్ని శాఖలు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖలు సాధించిన పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో జేసీ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టర్లు డా.ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.రాబర్ట్‌పాల్, ఉద్యాన వన శాఖాధికారి వై.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

### కనులపండువగా కోడూరుమాత యాత్ర



దివ్యబలిపూజలో వాక్యపరిచర్య గావిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతి బాల

**బాడంగి:** విజయనగరం జిల్లా బాడంగి మండలం కోడూరులో వెలసిన కోడూరుమాత యాత్రోత్సవం శనివారం కనులపండువగా జరిగింది. వేలాదిమంది క్రైస్తవ, క్రైస్తవేతర భక్తులు మరియమ్మను దర్శించుకున్నారు. టెంకాయలు కొట్టారు. తలనీలాలు సమర్పించారు. విశాఖ అగ్రపీఠాధిపతి బాల, ఫాదర్లు చెప్పిన బైబిల్ వాక్యాలను శ్రద్ధగా విన్నారు. బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి ఆధ్వర్యంలో రూరల్ సీఐ నారాయణరావు, బాడంగి, రామభద్రాపురం, తెర్లాం ఎస్‌ఐలు, పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.

### ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక




ప్రమాణ స్వీకారం చేస్తున్న కలెక్టరేట్ యూనిట్ కార్యవర్గ సభ్యులు

**పార్వతీపురం రూరల్:** కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కలెక్టరేట్ యూనిట్, పార్వతీపురం డివిజన్‌లకు సంబంధించిన ఎన్నికలు నిర్వహించారు. కార్యవర్గ సభ్యులు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఎన్నికల నిర్వాహకులు ఎం.రాజేంద్ర, ఎం.ఎస్.ప్రసాద్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి, మెంబర్లుగా కలెక్టరేట్ యూనిట్‌కు సంబంధించి 12 మందిని, పార్వతీపురం డివిజన్‌కు సంబంధించి 12మందిని ఏకగ్రీంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

**కలెక్టరేట్ యూనిట్ కార్యవర్గం ఇదే..**
అధ్యక్షుడిగా కె.చంద్రమౌళి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎ.చిన్నారావు, ఉపాధ్యక్షులులుగా ఎం.మంజూష, కె.సుధీర్‌బాబు, సెక్రటరీగా సీహెచ్ రాజేష్, జాయింట్ సెక్రటరీలుగా కె.సూర్యారావు, బి.మనోజ్‌కుమార్, బి.శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా టి.వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా పి.మోహన్‌కృష్ణ, కె.సన్యాసిరావు ఎన్నికయ్యారు.

**పార్వతీపురం డివిజన్ యూనిట్ కార్యవర్గం ఇదే..**



ఎన్నికైన పార్వతీపురం డివిజన్ యూనిట్ కార్యవర్గ సభ్యులు

అధ్యక్షుడిగా బాలమురళీకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా పి.కిరీటి, ఉపాధ్యక్షులుగా ఎం.జగదీశ్వరరావు, పి.తిరుమలరావు, ఎస్.సునీత, సెక్రటరీగా పి.రమేష్‌నాయుడు, జాయింట్ సెక్రటరీలుగా జి.శ్రీనివాసరావు, టి.రమేష్, వై.విజయకుమార్, ట్రెజరర్‌గా ఎం.రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.రమణమూర్తి, సీహెచ్ పద్మిని సువర్ణ ఎన్నికయ్యారు.

### విజయనగరం ఎస్పీగా దామోదర్

**విజయనగరం క్రైమ్:** విజయనగరం జిల్లా కొత్త ఎస్పీగా ఎం.ఆర్.దామోదర్ నియామకమయ్యారు. ఈయన 2013 బ్యాచ్‌కు చెందిన వారు. ప్రకాశం జిల్లా ఎస్పీగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీ అయ్యారు. ఆయన 2019లో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు విజయనగరం జిల్లా ఎస్పీగా పనిచేశారు. ఇంతవరకు జిల్లా ఎస్పీగా పనిచేసిన వకుల్‌జిందల్‌కు గుంటూరు జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యింది.



పార్వతీపురం సబ్‌కలెక్టర్ ఆర్.వైశాలి



పాలకొండ సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్



కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి

# నూతన రథసారథులు..
# మీపైనే మన్యం ఆశలు

సాక్షి, పార్వతీపురం మన్యం:

జిల్లా ప్రగతికి.. సుపరిపాలనకు సరైన నాయకత్వం, మార్గనిర్దేశం అవసరం. అది కొరవడిన రోజు పాలన గాడి తప్పుతుంది. పర్యవేక్షణ కొరవడి, ప్రగతి కుంటుపడుతుంది. ప్రజాప్రతినిధుల కంటే ఐఏఎస్‌లు పవర్ ఫుల్. అభివృద్ధిలో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకుంటూ వెళ్లాలి. ఇదే సందర్భంలో తమకు ఉన్న విచక్షణా అధికారాలను తాకట్టు పెట్టేలా వ్యవహరించడం.. సరైన రీతిలో వినియోగించక పోవడం పెద్ద తప్పిదమే. కొంతకాలంగా జిల్లాలో అదే లోపించినట్లు కనిపిస్తోంది. ఫలితంగా వివిధ శాఖల్లో క్రమశిక్షణ దారి తప్పింది. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారింది. కింది స్థాయి ఉద్యోగులు సైతం ఆ శాఖలపై పెత్తనం చెలాయించే పరిస్థితి దాపురించింది. తమ సమస్యలను చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు.. వాటి పరిష్కారం మాట దేవుడెరుగు.. మొర వినిపించడానికి సైతం ఆంక్షలు పెట్టారు. కలెక్టరు కార్యాలయం చుట్టూ బారికేడ్లు, రిబ్బన్లు కట్టించడంలో చూపించిన శ్రద్ధ.. పాలనపై పెట్టిన దాఖలాలు కనిపించలేదు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్‌గా ప్రభాకర రెడ్డి, సంయుక్త కలెక్టర్‌గా యశ్వంత్ కుమార్ రెడ్డి రెండు రోజుల వ్యవధిలోనే బాధ్యతలు స్వీకరించారు. జేసీగా వచ్చిన యశ్వంత్ కుమార్ రెడ్డికి పాలకొండ డివిజన్‌లో పనిచేసిన అనుభవం ఉంది. జిల్లా పరిస్థితులపై కొంతమేర అవగాహన ఉంది. కొత్త కలెక్టర్ ప్రభాకర రెడ్డిలో జిల్లాను అభివృద్ధిలో పెట్టాలన్న సంకల్పం కనిపిస్తోంది. మరో వైపు పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లుగా ఆర్.వైశాలి, పవర్‌స్వప్నిల్ జగన్నాథ్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే తమదైన శైలిలో ప్రజాసేవలో తరిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి చొరవచూపుతున్నారు. జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన ఉన్నతాధికారులు చురుగ్గా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని, జిల్లాను ప్రగతి పథంలో నడుపుతారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### కొత్త అధికారులకు సమస్యలు సవాల్...

గత ఏడాదిన్నర కాలంలో జిల్లాలో చెప్పుకోవలసిన ప్రగతి లేదు. కీలక ప్రాజెక్టులు ముందుకు సాగలేదు. పార్వతీపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. సాలూరు, సీతంపేటల్లోనూ గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఆస్పత్రి నిర్మాణాల పనులు బిత్తర చూపులు చూస్తున్నాయి.

- ప్రాజెక్టుల్లో పురోగతి కాన రాలేదు. సాగునీటి రంగంలో కీలకమైన తోటపల్లికి.. నిధుల లేమి వెంటాడుతోంది. శివారు భూములకు నీరు అందడం ప్రశ్నార్థకమై కూర్చుంది. రైతాంగానికి సాగునీటి సమస్యకు పరిష్కారం చూపలేక పోయిన యంత్రాంగం.. కనీసం ఎరువులు, యూరియాను కూడా పూర్తిస్థాయిలో అందించలేకపోయారు. రైతులు బస్తా యూరియా కోసం తల్లడిల్లిపోయినా అధికారులు కొరత లేదంటూనే చెప్పుకొచ్చారు. కళ్లెదుటే.. యూరియా అక్రమ మార్గం పట్టినా, ఒడిశా వైపు మళ్లినా చోద్యం చూశారు.
- సకాలంలో ధాన్యం కొనుగోలు చేయలేక, రైతులను అవస్థలకు గురి చేశారు. ధాన్యం దళారుల పాలయింది. చౌక ధరల దుకాణాల్లో లభించే పీడీఎస్ బియ్యం ఒడిశా దారి పట్టింది.
- గిరిజన ప్రాంతాలకు రహదారులను కల్పిస్తున్నామని ఊదరగొట్టిన కూటమి పాలకులకు డోలీల మోతలు కనిపించడం లేదు. అధికారులు వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.
- జిల్లాలో ఉన్న రెండు ఐటీడీఏలు పూర్తిగా గాలికి పోయాయి. పాలకవర్గ సమావేశాలు లేవు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకం ఊసులేదు. చిన్నపాటి జ్వరం వచ్చినా.. పర్యవేక్షణ లేక, గిరిజన పిల్లలు మృత్యుఒడికి చేరుకుంటున్నారు. చాలా కాలంగా పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు రెగ్యులర్ పీఓలు లేరు. దీనివల్ల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. పార్వతీపురం రెగ్యులర్ పీవో, డీడీ లేకపోవడంతో.. సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గిరిజన ప్రాంతాలను, పాఠశాలలను సందర్శించిన దాఖలాలు లేవు. ఇక్కడి అధికారులు, ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక ఉద్యోగి చేతిలోనే మొత్తం అవినీతి, కమీషన్ల దందా నడుస్తోందన్న విమర్శలు ఉన్నాయి.
- జిల్లా కేంద్రంలో సమస్యలు కోకొల్లలు. ఇక్కడి ప్రజలకు తాగేందుకు బురద నీరే గతి. కనీసం కుక్కలను నియంత్రించలేని పరిస్థితిలో మున్సిపల్ సిబ్బంది ఉన్నారు. ఇటీవల కుక్కల దాడిలో చిన్నారి మృతి చెందడం ఇందుకు ఉదాహరణ. పట్టణాలతో పాటు.. పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారు. రోగాలు విజృంభించి ఆస్పత్రులు కిటకిటలాడుతున్నా ముందస్తు చర్యలు శూన్యం. ఎవరికీ పట్టని ఏనుగుల సమస్య ఉండనే ఉంది.
- రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. అడుగుకో గొయ్యి ప్రాణాలను హరిస్తున్నాయి.
- జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి కుంటుపడింది. జీడీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకాకపోవడంతో జీడి రైతులు ఆవేదన చెందుతున్నారు.
- పాలకుల కక్షపూరిత విధానాలతో చిరుద్యోగులకు ఉద్యోగభద్రత కరువైంది. కొత్త అధికారులు ఈ పరిస్థితిని చక్కదిద్ది ఉద్యోగ భరోసా కల్పిస్తారన్న ఆశతో ఉద్యోగులు ఉన్నారు.

### వివిధ శాఖల్లో గాడి తప్పిన పాలన..

జిల్లా అభివృద్ధికి ప్రధాన ఆయువు పట్టు అయిన ప్రభుత్వ శాఖల్లో క్రమశిక్షణ లోపించి, అవినీతి పెరిగింది. కుర్చీలాటతో విద్యా శాఖను భ్రష్టు పట్టించారు. కొంతకాలంగా రెగ్యులర్ డీఈవో లేరు. ఒక ఎస్టీటీ మొత్తం విద్యా శాఖను తన కనుసన్నల్లో నడిపిస్తుండడం విశేషం. తన కుటుంబ సభ్యులకే కలెక్టరేట్ అభివృద్ధి పనుల కాంట్రాక్టులు కూడా ఇప్పించుకోవడం.. సదరు ఉద్యోగి హవాకు అద్దం పడుతోంది.

- డ్వామాను అవినీతి దోమ కుట్టి పడేస్తోంది. ఉపాధి హామీ పనుల్లో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుంటోంది. ఉపాధి వేతన దారుల నుంచి వారానికి రూ.వంద చొప్పున అనధికారికంగా వసూలు చేస్తున్నట్లు బహిరంగంగానే ఆరోపణలు ఉన్నాయి. గోకులం షెడ్లు, ఇతర పనుల్లో నిధులు పక్కదారి పట్టాయి. ఉన్నతాధికారి బదిలీ అయినా.. ఇక్కడే కొనసాగుతుండటం గమనార్హం.
- పార్వతీపురం మున్సిపాలిటీలో ఉద్యోగుల మధ్య విభేదాలు, అవినీతి ఆరోపణలతో ఇటీవల వార్తల్లో నిలిచారు. వైద్య శాఖలో పెత్తనమంతా ఉద్యోగ సంఘ నేత చేతుల్లోనే ఉంది. ఐసీడీఎస్ పైనా పర్యవేక్షణ కొరవడింది. ఫలితంగా ఇక్కడి సిబ్బంది మీద వివిధ అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అవినీతిపై చూపుతున్న శ్రద్ధ.. విధి నిర్వహణలో కనిపించడం లేదు. జిల్లా నుంచి బదిలీపై సిబ్బంది వెళ్తున్నారే గానీ.. ఇక్కడికి వచ్చేందుకు ఎవరూ సాహసించడం లేదు. వీటిని గాడిని పెట్టాల్సిన అవసరం, బాధ్యత కలెక్టర్, జేసీల పైనే ఉంది. గిరిజన ప్రాంతం అధికంగా ఉన్న జిల్లాలో గిరిజన విద్య, ఉపాధి సంక్షేమం, ఆరోగ్యం, రహదారి, విద్యుత్, తాగునీరు, సాగునీరు సౌకర్యాలు కల్పించాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు. నూతన అధికారులు పాలనను గాడిలో పెడతారని ఆశిస్తున్నారు.



## అక్షరమే ఆయుధం

### విలేకరుల సమావేశం కవర్ చేస్తే కేసులు పెడతారా?



రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న 'సాక్షి' గొంతునొక్కేందుకు చూస్తోంది. ఒక రాజకీయ పార్టీ నేత ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన మాటలను జర్నలిస్టు వార్తగా రాస్తే కేసులు పెట్టడం దారుణం. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛ, వాక్‌స్వాతంత్య్రం హక్కు అమలులో ఉందా?లేదా? అనే ఆందోళన కలుగుతోంది. సాక్షి పత్రిక ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం సమంజసం కాదు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలు కూటమి పాలకుల తీరును గమనిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకోవాలి.

– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే, పార్వతీపురం

### కలంపై కక్షసాధింపు తగదు



ప్రశ్నించే కలంపై కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు తగదు. రాజ్యాంగంలో పత్రికా రంగం నాలుగో స్తంభం. ఒక పత్రికపై అక్కసు వెళ్లగక్కితే మరన్ని పత్రికలు ప్రశ్నిస్తాయి. లోపభూయిష్ట పాలనపై వ్యతిరేక వార్తలు రావడం సహజం. వాటిలో లోపాలను గుర్తించి, వాటిని సరిచేసుకుని సర్కారు ముందుకు వెళ్లాలి. విలేకరుల సమావేశంలో ఓ రాజకీయ నాయకుడి ప్రసంగాన్ని ప్రచురిస్తే కేసు పెట్టడం ఇదే తొలిసారి. ఇప్పటికైనా ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలి. ప్రభుత్వ అనుకూల పత్రికల్లో కూడా ప్రస్తుత ప్రజా ప్రతినిధులు అవినీతిపై వార్తలు వచ్చాయి. అంతమాత్రాన వారిపై కూడా కేసులు పెట్టారా...పెడతారా..?. సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై పెట్టిన అక్రమ కేసులు తక్షణమే ఉపసంహరించుకోవాలి.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ మాజీ ఎమ్మెల్యే

# ప్రజలతో మమేకమవుతా..

- సమస్యలను అధ్యయనం చేసి, పరిష్కారానికి కృషిచేస్తా
- అన్ని రంగాల్లో జిల్లాను ప్రగతి పథంలో నడపడమే ధ్యేయం
- మన్యం జిల్లాకు రావడం ఆనందంగా ఉంది
- నూతన కలెక్టర్ ప్రభాకర రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రభాకర రెడ్డి

**సాక్షి, పార్వతీపురం మన్యం:** అన్ని రంగాల్లో జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని కలెక్టర్ ఎస్.ప్రభాకర రెడ్డి తెలిపారు. జిల్లా నూతన కలెక్టర్‌గా నియమితులైన ఆయన శనివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రజలతో మమేకమై సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

**జిల్లా సమగ్రాభివృద్ధికి తోడ్పాటు..**
వెనుకబడిన ప్రాంతమైన మన్యం జిల్లాలో గిరిజన సంక్షేమాభివృద్ధికి, విద్య, వైద్య రంగాల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తామని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పాలనపై త్వరగా పట్టుసాధిస్తానని, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి జిల్లా సమగ్రాభివృద్ధికి తోడ్పాటునందిస్తానని స్పష్టం చేశారు. గతంలో కంటే మన్యం జిల్లాలో అభివృద్ధి పనులు సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. జిల్లాను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో నడిపిస్తానన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధిలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకొని దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

### ఇళ్లపై కూలిన చింతచెట్టు



జోగిపురంలో ఇళ్లపై కూలిన చింతచెట్టు

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. జోగిపురం గ్రామంలోని గిరిజనుల ఇళ్లపై భారీ చింతచెట్టు కూలింది. గిరిజనులు బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఆరు ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. ప్రభుత్వ యంత్రాంగం స్పందించి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని గిరిజన కుటుంబాలు కోరుతున్నాయి.

# మెడికల్ సీట్లు అమ్మకం సిగ్గుచేటు?

- పీపీపీ విధానాన్ని రద్దుచేయకుంటే పోరాటం చేస్తాం
- వైద్యవిద్యను అభ్యసించాలనుకునే పేదకుటుంబాల విద్యార్థులకు ద్రోహం చేయొద్దు
- మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి

**జియ్యమ్మవలస రూరల్:** ఆదాయం కోసం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరంచేసి సీట్లు అమ్ముకోవడం సిగ్గుచేటని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి అన్నారు. చినమేరంగిలో తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాన్య, పేద కుటుంబాల్లో విద్యార్థులకు వైద్య విద్యను అందించాలన్న సదుద్దేశంతో 17 మెడికల్ కళాశాలలను మంజూరు చేశారన్నారు. అందులో ఐదు మెడికల్ కళాశాలల పనులు పూర్తి చేసి తరగతులు ప్రారంభించగా, మరో రెండు కళాశాలల్లో కూడా తరగతులు కొనసాగుతున్నాయన్నారు. ఇవి ప్రభుత్వానికి కనిపించకపోవడం విచారకరమన్నారు. రాష్ట్ర హోం మంత్రి ఎప్పుడో తీసిన చిత్రాలను చూపించి మెడికల్ కళాశాలల్లో పరిస్థితి ఈ విధంగా ఉందని అబద్ధపు మాటలు చెప్పడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన, ఘోర కృత్యాలు, లైంగిక వేధింపులపై స్పందించకుండా కళాశాలలపై అబద్ధపు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న ఆమెకు విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల, పాడేరు, కడపలో ఉన్న ఏడు వైద్య కళాశాలలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇవి కూటమి నాయకులు చూపిస్తున్న అమరావతి గ్రాఫిక్ చిత్రం కాదని, ఇక్కడ కళాశాలలు ఉన్నాయా? లేదా?, తరగతులు జరుగుతున్నాయా? లేదా? అనేది ఒకసారి కళ్లుతెరచి చూస్తే కనిపిస్తాయన్నారు. మెడికల్ కళాశాలలో సీట్లు సంపాదించి చదివిన వారికి ఆ సీటు విలువేంటో తెలుస్తుందన్నారు. ఎంతో ముందు చూపుతో గత ప్రభుత్వం ఒక్కో వైద్య కళాశాలకు రూ.600 కోట్లు వెచ్చించి మంజూరు చేసిందన్నారు. ఆ కళాశాలను పీపీపీ విధానంలో ప్రైవేటు పరం చేసేందుకు క్యాబినెట్‌లో ఆమోదంచేశారంటే పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల ఉసురు తప్పక తగులుందన్నారు. దీనిపై ఉద్యమం సాగిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను తానే తెచ్చానని చెబుతుంటే... అదే కేబినెట్‌లో మంత్రిగా ఉన్న పార్థసారథి గత ప్రభుత్వంలో 15 మెడికల్ కళాశాలలు మంజూరయ్యాయని, 7 మెడికల్ కళాశాలలు వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయని చెబుతున్నా ఇవేవీ బాబు చెవికి ఎక్కడం లేదని ఎద్దేవా చేశారు. 1923లో విశాఖలో కింగ్‌జార్జ్ ఆస్పత్రి ఏర్పాటుచేశారని, వందేళ్ల పైబడి సూపర్‌స్పెషాల్టీ సేవలు అందిస్తోందన్నారు. అదే మాదిరిగా పార్వతీపురంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి 90 శాతం ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీలు ఉన్న జిల్లాకు ఒక సూపర్‌స్పెషాల్టీ మెడికల్ కళాశాలను మంజూరుచేసే ఆలోచన ఈ వందేళ్లలో ఏ ఒక్క నాయకుడికి లేదని, అది ఒక్క వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే చెల్లుతుందన్నారు. అలాంటి మెడికల్ కళాశాలలను నేడు ప్రైవేటీ కరణ చేస్తామంటే ఊరుకొనేది లేదని హెచ్చరించారు. 2022లో జిల్లాల ఏర్పాటు సమయంలోనే పార్వతీపురానికి మెడికల్ కళాశాల మంజూరు చేసి ఉల్లిభద్ర వద్ద స్థల సేకరణ జరిగిన సంగతిని కూటమి నాయకులు గుర్తుచేసుకోవాలన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసి, ఆ పాపాన్ని ఆపాదించుకోవద్దని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు, లోలుగు నారాయణరావు, శెట్టి పద్మావతి, సుజాత, సింహాచలంనాయుడు, సత్యంనాయుడు, కళ్యాణ్, రామకృష్ణ, ఎస్.కె.నిషాన్, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి తీరుపై గర్జించిన ఎర్రదండు

- ప్రజల సంపదను పెట్టుబడిదారులకు కట్టబెతున్నారు
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి





పాలకొండ పట్టణంలో ర్యాలీ చేస్తున్న కార్మికులు





మాట్లాడుతున్న సీఐటీయూ నేత నర్సింగరావు

**పాలకొండ:** కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై ఎర్రదండు గర్జించింది. శ్రమ జీవులను దోచుకుని, ప్రజల సంపదను పెట్టుబడి దారులకు కట్టబెడుతోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు ధ్వజమెత్తారు. పాలకొండలోని ఓ కల్యాణ మండపంలో సీఐటీయూ జిల్లా మహాసభలను శనివారం ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని ప్రధాన రహదారిలో భారీ ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభలో నర్సింగరావు మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లను మోసగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. విశాఖలోని భూములు పెట్టుబడి దారులకు కట్టబెతున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఎన్నికల ముందు కథలు చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడంలేదని ప్రశ్నించారు. కాంట్రాక్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ కార్మికుల పొట్టకొడుతున్న కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు కొనసాగిస్తామని తెలిపారు. కార్మిక వర్గాల పట్ల జరుగుతున్న అన్యాయాలపై పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, సీనియర్ నాయకులు ఎం.తిరుపతిరావు, మన్మథరావు మాట్లాడారు. జిల్లాలోని పలు కార్మిక యూనియన్‌లకు చెందిన నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### విమానాశ్రయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- కేంద్ర విమానయాన శాఖామంత్రి రామ్మోహన్‌నాయుడు

**భోగాపురం:** ప్రభుత్వం నిర్దేశించిన సమయం కంటే ముందే విమానాశ్రయ నిర్మాణ పనులను పూర్తిచేయాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు, అధికారులను ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. అధికారులతో సమావేశమై పనుల తీరుపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విమానాశ్రయ నిర్మాణ పనులు 86 శాతం పూర్తయ్యాయని, 2026 జూన్ నాటికి ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### గుడి దొంగల అరెస్టు



పట్టుబడిన నిందితులతో ఎస్ఐ దుర్గాప్రసాద్

పూసపాటిరేగ : మండలంలోని కనిమెల్ల గ్రామంలో దొంగతనం చేసిన నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఐ.దుర్గాప్రసాదు శనివారం తెలిపారు. పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కనిమెల్ల గ్రామంలోని గుడిలో ఇద్దరు నిందితులు దొంగతనం చేసినట్టు తేలడంతో సొత్తు రికవరీ చేసినట్టు తెలిపారు. పేరాపురం, కోనాడ గ్రామాలలో ఇదే వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్ దొంగతనానికి పాల్పడినట్టు పేర్కొన్నారు.

### డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.8.50 లక్షల జరిమానా

విజయనగరం క్రైమ్: మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబడిన 85 మంది వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానాను విజయనగరం అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.హెచ్.ఆర్.తేజ చక్రవర్తి విధించారని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. విజయనగరం ట్రాఫిక్ సీఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 85 కేసులు నమోదు చేశారు. అడిషనల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వద్ద హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 85 మందికి రూ.8.50 లక్షలను జరిమానాగా విధించారని ఎస్పీ తెలిపారు.

### 15 నుంచి స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపికలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 15 నుంచి నిర్వహించనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు కె.గోపాల్, ఎస్.విజయలక్ష్మి శనివారం తెలిపారు. 15న రాజీవ్ స్టేడియంలో బాక్సింగ్ పోటీలు, కొండవెలగాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెజ్లింగ్ క్రీడాంశంలో ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. 16న విజయనగరం విజ్జీ స్టేడియంలో తైక్వాండో, స్కేటింగ్, సైక్లింగ్ పోటీలు, మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రగ్బీ పోటీలు నిర్వహిస్తామన్నారు. 17న విజయనగరంలో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్ క్రీడాంశంలో, బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్చరీ క్రీడాంశంలో ఎంపికలు జరుగుతాయన్నారు. అండర్ - 14, 17 వయస్సుల విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహించే పోటీల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### మహిళా రోగి పట్ల రేడియోగ్రాఫర్ అసభ్య ప్రవర్తన!

- సర్వజన ఆసుపత్రిలో ఘటన
- ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితురాలు

విజయనగరం ఫోర్ట్: ఎక్సరే కోసం వెళ్లిన ఓ మహిళ పట్ల సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న ఓ రేడియోగ్రాఫర్ అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గజపతినగరం మండలానికి చెందిన ఓ మహిళ ఫైల్స్ వ్యాధితో సర్వజన ఆసుపత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు ఆపరేషన్ చేయాలని ఆసుపత్రిలో ఇన్‌పేషంట్‌గా చేర్చారు. శనివారం ఎక్సరే తీయించాలని వైద్యులు చీటి రాసి ఇవ్వడంతో అది పట్టుకుని మహిళ ఎక్సరే విభాగానికి వెళ్లింది. ఎక్సరే గదిలోకి వెళ్లిన మహిళ పట్ల ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఓ రేడియాగ్రాఫర్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేస్తూ బయటకు వచ్చేసింది. గది బయట ఉన్న తన భర్తకు విషయం చెప్పడంతో సదరు ఉద్యోగిపై ఆసుపత్రి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ఉద్యోగికి ఆసుపత్రి అధికారులు మెమో జారీ చేసినట్టు తెలిసింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లు పద్మజ వద్ద సాక్షి ప్రస్తావించగా తమ దృష్టికి ఈ విషయం వచ్చిందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

### మహిళ ఆత్మహత్య

విజయనగరం క్రైమ్ : నగరంలోని వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణంలో ఓ మహిళ శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. విజయనగరం రూరల్ ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాలు... కొత్తవలసకు చెందిన భారతి గుజరాత్‌కు చెందిన షిండేను వివాహం చేసుకుంది. షిండే మోసగాడని తెలిసి విబేధించి అతనకు దూరంగా ఉంటుంది. ఈ విషయం కొత్తవలస పోలీసులకు తెలిసి ఆమెను విజయనగరంలోని వీటీ అగ్రహారం మహిళా ప్రాంగణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉన్న హోమ్‌కు తరలించారు. ఇక్కడ చేరిన తరువాత భారతి శనివారం బాత్రూమ్‌కని వెళ్లి ఎంతకీ తిరిగి రాలేదు. హోం సిబ్బంది అనుమానంతో తలుపు పగలగొట్టి చూడగా బాత్రూమ్‌లోని కిటికీకి చున్నీతో కట్టి ఆత్మహత్య చేసుకుంది. హోం ఉద్యోగి భవ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ అశోక్ ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### చికెన్

| బ్రాయిలర్ | | |
|---|---|---|
| లైవ్ | డ్రెస్డ్ | స్కిన్‌లెస్ |
| ₹152 | ₹274 | ₹284 |




# రాజభాష హిందీ

- నేడు జాతీయ భాష హిందీ దినోత్సవం
- ప్రతీ ఏడాది సెప్టెంబర్ 14న నిర్వహణ
- వారం రోజుల పాటు పక్షోత్సవాలు
- ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించే హిందీ
- రోజురోజుకు హిందీ కోర్సుకు పెరుగుతున్న ఆదరణ

రాజాం : హిందీ భాష దేశ భాషే కాకుండా రాజసం ఉట్టిపడే రాజభాష. దేశ ప్రజలందరినీ ఒకే తాటి మీదకు తీసుకొచ్చేందుకు ప్రధాన వారధి హిందీ భాష. దాదాపు 3,372 పైగా భాషలుండగా, 24 అధికార భాషలను గుర్తించినప్పటికీ.. జాతీయ భాషగా హిందీనే మన దేశం గుర్తించింది. ఈ దేశంలో హిందీ భాషను మాట్లాడేవారు, అర్థం చేసుకునే వారు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 1949 సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగంలోని 343వ అధికరణం ప్రకారం దేవనాగరి లిపిలోని హిందీని అధికార భాషగా గుర్తించింది. నాటి నుంచి ఏటా సెప్టెంబర్ 14న జాతీయ హిందీ భాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ జాతీయ భాషా దినోత్సవాన్ని హిందీ దివాస్‌గా పిలుస్తారు.

#### ఒకటే దేశం.. ఒకటే భాష

మన దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో హిందీ మాతృభాషగా ఉంది. అలా అని అక్కడ హిందీ ఒక్కటే లేదు. దాంతో పాటు మరికొన్ని ఇతర భాషలు కూడా ఉన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఒడిశా, పంజాబ్, బెంగాల్, కశ్మీర్ రాష్ట్రాల వాళ్లకు ప్రాంతీయ మాతృభాషలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినపుడు భాషా సమస్య ఉత్పన్నమైంది. ఈ భాషా సమస్యను అధిగమించేందుకు జాతీయ భాషను గుర్తించాల్సి వచ్చింది. అంతేకాకుండా మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక.. ప్రభుత్వ కార్యకలాపాలను జాతీయ స్థాయిలో నిర్వహించడానికి ఏ భాషను వాడాలి? అనే ప్రశ్న తెరపైకి వచ్చింది. దీనిపై మన దేశ జాతీయ నాయకుల మధ్య జరిగిన చర్చల ఫలితంగా 1949 సెప్టెంబర్ 14న హిందీని అధికార భాషగా నిర్ణయించారు. నాటి నుంచి ఆ రోజున జాతీయ హిందీ భాషా దినోత్సవం ప్రతీ ఏడాది జరుపుకుంటున్నాం.

#### నాగరికత పుట్టుక నుంచి

- హిందీ.. అనే పదం పర్షియన్ భాషలోని హింద్ నుంచి వచ్చింది. హింద్ అంటే సింధు నది ప్రవహించే నేల అని అర్థం.
- 11వ శతాబ్ద కాలంలో టర్కీ పాలకులు మన దేశంపై దండయాత్రకు వచ్చినప్పుడు హింద్ అనే పదాన్ని ఉపయోగించినట్టు చరిత్ర పరిశోధకులు చెబుతుంటారు. హిందీ భాష సంస్కృతం నుంచి పుట్టగా... దీన్ని దేవనాగరిక లిపిలో రాయడం జరుగుతోంది.
- దేవనాగరి లిపిలో రాసే హిందీ భాషలో చాలా మాండలికాలు కనిపిస్తాయి. వీటిలో బ్రజ్, ఖరీ, బోలీ, బుందేలీ, అవధి, బాఘేలి వంటి మాండలికాలు ప్రముఖమైనవి. ప్రపంచ వ్యాప్తంగా 180కి పైగా విశ్వ విద్యాలయాల్లో హిందీ భాషకు సంబంధించిన అధ్యయనాలు, పరిశోధనలు జరుగుతున్నాయి.

#### వారోత్సవాలు.. పక్షోత్సవాలు...

హిందీ దివాస్ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 14న హిందీ భాషా దినోత్సవం నిర్వహిస్తారు. హిందీ ప్రచారక్‌లు ఉన్న కేంద్రాల్లో వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహించి ర్యాలీలు చేయడంతో పాటు ప్రజలకు హిందీ భాషపై అవగాహన కల్పిస్తుంటారు. హిందీ భాష అభివృద్ధికి కృషి చేసిన హిందీ భాష సాహితీవేత్తలు, కవులతో పాటు రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తారు.

#### మెండుగా అవకాశాలు

హిందీ భాషను నేర్చుకున్న వారికి, అందులో డిగ్రీ పట్టాలు పొందిన వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. కేంద్ర సాయుధ బలగాల్లో చేరేందుకు హిందీ భాషలో ప్రావీణ్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుంది. రైల్వే ఉద్యోగాలు పొందే వారిలో ఎక్కువ మంది హిందీ భాషపై పట్టు ఉన్నవారే కనిపిస్తున్నారు. ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక, విశారద, ప్రవీణ్, విద్వాన్ వంటి కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు సివిల్ సర్వీసులతో పాటు డిగ్రీ తత్సమాన పోటీ పరీక్షలు, ఉద్యోగ పరీక్షలకు అర్హులుగా గుర్తింపు పొందుతున్నారు.

#### సులభమైన భాష



హిందీ భాష చాలా సులభతరమైన భాష. నిరుద్యోగులు చాలా మందికి ఉపాధి కల్పిస్తుంది. పది, ఇంటర్ తరువాత హిందీ సబ్జెక్టుగా తీసుకుని డిగ్రీ చేయడం, తర్వాత హిందీ పండిట్ శిక్షణ పొందడం, గ్రూప్ - 1, 2 వంటి ఉద్యోగులు సంపాదించడం చాలా తేలిక.

కె.మధుసూధనరావు, హిందీ ప్రచారక్, రాజాం

#### బాగా కష్టపడితే



హిందీ భాషలో చదువుకుని బాగా కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయి. పదో తరగతి తరువాత ఇంటి వద్దే ఉండి ఉన్నత చదువులు చదువుకోవాలంటే హిందీ ప్రచార సభలు చాలా ఉపయోగపడుతున్నాయి.

బి.ఎల్.నాయుడు, హిందీ భాషోపాధ్యాయులు, రాజాం

## ఐదుగురికి నక్క కాటు

- చివరకు నక్కను చంపేసిన బాధితుడు



నక్క తన కాలును కరుస్తూ ఉండిపోవడంతో నిస్సహాయ స్థితిలో నక్కపై కూర్చుని ఉండిపోయిన చిన్నోడు

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లి గ్రామానికి చెందిన ఎమ్.లక్ష్మి, కె.సూరయ్య, వి.లచ్చమ్మ, బూరాడపేట గ్రామానికి చెందిన బంటుపల్లి చిన్నోడు, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన కె.జగన్‌మోహన్‌లకు నక్క కాటేసింది. వీరు సంతకవిటి పీహెచ్‌సీకి రావడంతో వేక్సినేషన్ వేసినట్టు వైద్యాధికారి యు.నాగేంద్ర ప్రసాద్ శనివారం తెలిపారు. కె.జగన్‌మోహన్ రాజాం స్కూటిపై వెళ్తుండగా సంతకవిటి సమీపంలో నక్క దాడి చేసి కాటు వేసింది. అక్కరాపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు సంతకవిటి నుంచి అక్కరాపల్లి వెళ్తుండగా సంతకవిటి సమీపంలోనే అకస్మాత్తుగా దాడి చేసి గాయపరిచింది.

**నక్కతో పోరాటం**

బూరాడపేట గ్రామానికి చెందిన బంటుపల్లి చిన్నోడుకు సంతకవిటిలోని భాను ఫిల్లింగ్ స్టేషన్ వద్ద అకస్మాత్తుగా నక్క దాడి చేసి దాదాపు 30 నిమిషాలు కాలును పట్టేయడంతో నక్కపై కూర్చొని నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. స్థానికులు కూడా చూసి భయపడి కాసేపట్లో తేరుకుని నక్కను చంపడంతో చిన్నోడుకు పెను ప్రమాదం తప్పింది. అనంతరం చిన్నోడు పీహెచ్‌సీకి వెళ్లి వేక్సినేషన్ వేసుకున్నారు.

## విద్య, వైద్య రంగాలను ప్రభుత్వమే నడపాలి



పల్ల కొండలరావుతో మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

పాలకొండ: విద్య, వైద్య రంగాలను ప్రభుత్వమే నడపాల్సిన అవసరం ఉందని కార్మిక సంఘాల నాయకుడు, సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. పాలకొండలో ఆధ్యాత్మికవేత్త పల్లా కొండలరావును కలిసి రిలీజ్ కాబోతున్న ఆయన సినిమాను చూడాలని కోరారు. ప్రస్తుత సమాజంలో విద్య, వైద్యానికి ఉన్న ప్రాధాన్యంను సినిమాలో చూపించామన్నారు. పేదల కోసం పనిచేయడం ప్రభుత్వాల బాధ్యతని తెలిపారు.

## సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

- కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి



ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి



వసతి గృహంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పరిసరాలను, వార్డులను పరిశీలించి వైద్యాధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలను జారీ చేశారు. ఆసుపత్రి పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని రోగులు, బాలింతలతో మాట్లాడిన కలెక్టర్ వైద్య సేవలు, ఉచిత మందుల పంపిణీ, సమస్యలపై ఆరా తీశారు. కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రి వార్డులను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. రోగులతో పాటు సహాయకులకు కూడా భోజనం ఏర్పాటు చేయాలని, ఇందుకు ఆసుపత్రిలోనే ఒక క్యాంటీన్ పెట్టేలా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పడకలతో పాటు అదనపు పడకలను పెంచడానికి, పెండింగులో ఉన్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ పనులు నిర్ణీత సమయానికి ముందే పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్న కలెక్టర్ సిజేరియన్ల సంఖ్యను తగ్గించి, సాధారణ ప్రసవాల సంఖ్య పెరగాలని సూచించారు. సిజేరియన్ రేటు ఎక్కువగా ఉన్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌వోలను కలెక్టర్ ఆదేశించారు.

**విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి..**

షెడ్యూలు కులాల సంక్షేమ బాలికల వసతిగృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి విద్యార్థినులతో ముచ్చటించి వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, విద్యను అందించాలని ఆదేశించారు. ఎల్లవేళల వసతిగృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, వారికి రక్తహీనత లేకుండా చూడాలని అన్నారు. పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. ఎస్.భాస్కరరావు, డీసీహెచ్‌ఎస్ నాగభూషణరావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా. ఎం.వినోద్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 17న ఆటోల బంద్

- ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ



మెయిన్ రోడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు, సంఘ నాయకులు

చీపురుపల్లి: ఆటో డ్రైవర్ల కడుపు కొట్టే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జిల్లా, రాష్ట్ర యూనియన్ల పిలుపు మేరకు ఈ నెల 17న నిర్వహించనున్న ఆటోల జిల్లా బంద్‌ను విజయవంతం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి నారాయణరావు కోరారు. శనివారం చీపురుపల్లి వచ్చిన ఆయన స్థానిక ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితం చేయడంతో ఆటో డ్రైవర్లపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. తక్షణమే ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్న డిమాండ్‌తో ఈ నెల 17న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 17న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలు వరకు పకడ్బందీగా బంద్ నిర్వహించాలన్నారు. ఈ బంద్‌కు సీఐటీయూ మద్దతు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నీలాపు అప్పలరాజు, సీఐటీయూ డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరునాయుడు, చీపురుపల్లి సంఘ నాయకులు పందూరి తాతాజీ, మాడుగుల రమణ, జగదీష్, రామకృష్ణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## పది లారీలు సీజ్



పట్టుబడిన లారీలతో విజిలెన్స్ సీఐ, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్లు

కొత్తవలస : పరిమితికి మించి అధిక బరువులను రవాణా చేస్తున్న పది లారీలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం ఆధ్వర్యంలో శనివారం సీజ్ చేశారు. అరుకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో రోడ్డు రవాణ శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు సంయుక్తగా దాడులు నిర్వహించారు.అధిక బరువుతో రవాణా చేస్తున్న పది లారీలను గుర్తించి సీజ్ చేసి రూ 6.80 లక్షలు జరిమానా విధించారు. సీజ్ చేసిన లారీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రమేష్‌కుర్, ఐశ్వర్యలక్ష్మి, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని పోడలి గ్రామానికి చెందిన పొన్నాడ తవుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. అదే గ్రామానికి చెందిన ఎస్.చిన్నవాడు వద్ద గతంలో పొన్నాడ తవుడు పని చేయడంతో తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడగగా తనపై శుక్రవారం కర్రతో దాడి చేశాడని శనివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## లోక్ అదాలత్‌లో 460 కేసుల రాజీ



సమావేశంలో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

పార్వతీపురం టౌన్: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 460 కేసులను ఇరువురి అంగీకారంతో రాజీ చేసినట్టు రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కక్షిదారులు రాజీ చేసుకోవడం వల్ల ఖర్చులు తగ్గుతాయని, మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుందన్నారు. కేసులను రాజీ చేసుకోవడమే ఉత్తమ మార్గమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కారమైతే కోర్టుకు మొదట చెల్లించిన రుసుమును కక్షిదారులకు కోర్టు తిరిగి చెల్లిస్తుందన్నారు. లోక్ అదాలత్‌లో బాధితులకు న్యాయం త్వరగా లభించే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో ఎక్కువగా క్రిమినల్ కేసులను రాజీ చేయడం జరిగిందని వివరించారు. సివిల్ కేసులు - 23, క్రిమినల్ కేసులు - 431, మోటారు యాక్సిడెంట్ - 7 కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించామని పేర్కొన్నారు. అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.చంద్రకుమార్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు లోక్ అదాలత్ సభ్యులు, అధిక సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం




జాతీయ లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

విజయనగరం లీగల్: రాజీయే రాజ మార్గమని కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహ పూరిత వాతావరణంలో ఎటువంటి వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎం.బబిత అన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్ వలన కక్షిదారులకు సమయంతో పాటు డబ్బు వృథా కాకూడదన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో పలు సివిల్, క్రిమినల్ కేసులు, రాజీ పడదగిన కేసులను రాజీ మార్గంలో ఇరు పార్టీల సమ్మతితో శాశ్వతంగా పరిష్కారం దొరుకుతుందన్నారు. జాతీయ లోక్ అదాలత్ ఉమ్మడి జిల్లాలైన విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లాల్లోని విజయనగరం పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం కోర్టులలో మొత్తంగా 6852 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. వాటిలో సివిల్ కేసులు 280, క్రిమినల్ కేసులు 6505, ప్రీ లిటిగేషన్ కేసులు 67 పరిష్కరించినట్టు తెలిపారు. జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన 37 లక్షల 50 వేల రూపాయలు మోటార్ ప్రమాద బీమా కేసులో పిటిషనర్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మొదటి శ్రేణి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మీనాదేవి, ఫ్యామిలీ కోర్ట్ జడ్జి కె.విజయ కళ్యాణి, బి.అప్పలస్వామి, నాలుగవ శ్రేణి న్యాయమూర్తి, ఎస్.పద్మావతి, మహిళా మరియు ఐదవ జిల్లా న్యాయమూర్తి కె.నాగమణి, ఫోక్స్ న్యాయమూర్తి మరియు జిల్లా న్యాయమూర్తి ఎ.కృష్ణప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కోర్ట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, పోలీస్, ఇన్సూరెన్సు అధికారులు, బ్యాంకు మేనేజర్లు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, ఎక్కువ సంఖ్యలో కక్షిదారులు పాల్గొన్నారు.

**కోర్టుల వారీగా పరిష్కారమైన కేసులు**

| కోర్టు | పరిష్కారమైన కేసులు |
|---|---|
| విజయనగరం | 2224 |
| పార్వతీపురం | 486 |
| బొబ్బిలి | 1451 |
| సాలూరు | 975 |
| శృంగవరపుకోట | 337 |
| గజపతినగరం | 577 |
| చీపురుపల్లి | 543 |
| కొత్తవలస | 156 |
| కురుపాం | 103 |
| మొత్తం | 6852 |

## తాగిన మైకంలో యువకుడి ఆత్మహత్య



తాగిన మైకంలో గొంతు కోసుకొని మృతి చెందిన చంద్రశేఖర్

పార్వతీపురం రూరల్/గుమ్మలక్ష్మీపురం : మద్యం తాగి ఆ మైకంలో తనకు తానే పదునైన చాక్‌తో తోయక చంద్రశేఖర్(32) అనే యువకుడు తన గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడడంతో గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక తాడికొండ పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్యసేవలు అనంతరం భద్రగిరి సీహెచ్‌సీకు తరలించి వైద్యుల సూచన మేరకు పార్వతీపురం కేంద్ర ఆసుపత్రికి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ మృతి చెందినట్టు పార్వతీపురం కేంద్ర ఆసుపత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పుట్టికతోనే వినికిడి, మూగ సమస్యలతో దివ్యాంగుడైన చంద్రశేఖర్ తాగుడుకు బానిస అయ్యాడు. అప్పుడప్పుడు మద్యం మత్తులో మతి భ్రమించినట్టు ప్రవర్తిస్తుంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. కురుపాం మండలంలోని తెన్నుఖర్జలో తన చెల్లి ఇంటికి వెళ్లి తాగి మద్యం మత్తులో ఉన్న చంద్రశేఖర్‌ను మందలించడంతో తన స్వగ్రామమైన ఎగువతాడికొండకు మూడు రోజుల క్రితం వచ్చి ఎప్పటిలాగే శుక్రవారం మద్యం సేవించి శనివారం వేకువజామున 3గంటల ప్రాంతంలో గొంతుకోసుకుంటూ ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే వైద్యసేవలకు తరలించామన్నారు. మృతుడు తల్లితండ్రులు చిన్నప్పుడే మృతి చెందగా సోదరుడు కిశోర్‌తో కలిసి జీవిస్తున్నాడని తెలిపారు.

## నాగావళి నదిలో దూకిన మహిళ

- ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం సమీపంలో నాగావళి నదిపై గల వంతెనపై నుంచి శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో గుర్తు తెలియని ఓ మహిళ దూకి ఆత్మహత్యా యత్నం చేసినట్టు అందిన సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నదీ తీరం పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు విజయనగరం జిల్లా పరిధిలో గల రేగిడి ఆమదాలవలసకు అనుసంధానంగా ఉంది. ఈ క్రమంలో రెండు జిల్లాలకు చెందిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వీరు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సాయంత్రం సమయంలో దాదాపు 30 ఏళ్ల మహిళ వంతెన పైనుంచి ఆత్మహత్యకు పాల్పడే క్రమంలో నదిలో దూకింది. అక్కడకు సమీపంలో ఉన్న కొందరితో పాటు పాలకొండ వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ కూడా ఈ ఘటనను గుర్తించారు. ఇటీవల కురుస్తున్న వర్ష ప్రభావంతో నదిలో నీటి ఉధృతి అధికంగా ఉండటంతో క్షణాల వ్యవధిలో ఆ మహిళ నదీ ప్రవాహంలో కొట్టుకుంటూ పోయినట్టు చూసిన వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రెండు జిల్లాల పోలీసులు, పాలకొండ అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు వెతుకులాట చేపట్టారు. ఫలితం లేకపోటం, చీకటి పడటంతో అంతా వెనుగిరిగారు. నదిలో దూకిన మహిళ వివరాలు తెలియరాలేదని, ఎటువంటి ఫిర్యాదు అందలేదని, వంతెన వద్ద చెప్పులు మాత్రమే ఉన్నట్టు పోలీసులు తెలిపారు.